క్లుప్తంగా

ఎమ్మెల్సీ శ్రీనును కలసిన పార్టీ శ్రేణులు



సఖినేటిపల్లిలో ఎమ్మెల్సీ శ్రీనును కలసిన వైఎస్సార్‌ సీపీ శ్రేణులు

సఖినేటిపల్లి: ఎమ్మెల్సీ కవురు శ్రీనును వైఎస్సార్‌ సీపీ శ్రేణులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సఖినేటిపల్లి రత్నాలపేటలోని గొల్ల జోసఫ్‌ నివాసంలో ఈ మేరకు ఎమ్మెల్సీని, ఎంపీపీ వీరా మల్లిబాబు, నాయకులు ఈద రవిరెడ్డి, నల్లి మోహన్‌, తాడి సహదేవ్‌ కలిశారు.

వృద్ధాశ్రమానికి ఏసీ బహూకరణ



వృద్ధాశ్రమానికి అందించిన ఏసీతో గ్రామస్తులు

మలికిపురం: మండలం విశ్వేశ్వరాయపురంలోని వృద్ధాశ్రమానికి అంతర్వేదిపాలెం గ్రామానికి చెందిన జంపన రాంబాబురాజు ఏసీని బహూకరించారు. తనకు మనుమడు పుట్టిన సందర్భంగా ఆ బాలునికి ఆశీస్సులు కోరుతూ వృద్ధాశ్రమానికి ఒక ఏసీని బహూకరించారు. ఆయన ఆప్తమిత్రుడు ముదునూరి ప్రసాదరాజు ద్వారా దీనిని అందించారు. ఆశ్రమంలోని వృద్ధులు ఎండాకాలంలో చాలా అవస్థలు పడుతున్నారని గమనించిన ప్రసాదరాజు తన మిత్రులు రాంబాబురాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఏసీని అందించారు. కార్యక్రమంలో ముదునూరి విష్ణుమూర్తి రాజు, సాయి రాజు, వర్మరాజు, చేకూరి శ్రీనివాసరాజు, మానవతా మూర్తులు -సేవా సంస్థ అధ్యక్షుడు బోనం రాజు, చంటి తదితరులు పాల్గొన్నారు.

ఇమామ్‌ హజరత్‌ అలీకి ఘన నివాళి



ఖురాన్లను శిరస్సుపై పెట్టుకుని ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం, మొదటి ప్రవక్త ఇమామ్‌ హజరత్‌ అలీ వర్ధంతిలో భాగంగా శనివారం మామిడికుదురు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. హజరత్‌ అలీకి ముస్లింలు ఈ సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించారు. మత ప్రబోధకుడు షబ్బర్‌ అలీ జైదీ ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. శిరస్సుపై ఖురాన్లు పెట్టుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. తదుపరి మజ్లిస్‌ జరిగింది. నగరం గ్రామంలోని పెద పంజీషాలో మత ప్రబోధకుడు ప్రార్థనలు చేయించారు. అనంతరం మజ్లిస్‌ జరిగింది. మొగలికుదురు మసీదులో మత ప్రబోధకుడు మొహ్మద్‌ ఇబ్రహీమ్‌ భక్తులతో ప్రార్థనలు చేయించి, మజ్లిస్‌ నిర్వహించారు. అధిక సంఖ్యలో ముస్లింలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

347 మందికి ఆరోగ్య పరీక్షలు



అప్పనపల్లి శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మామిడికుదురు: అప్పనపల్లిలో శనివారం ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. మొల్లేటివారి పాలెం సొసైటీ కార్యాలయం వద్ద జరిగిన ఈ శిబిరంలో నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత, పీడియాట్రిస్ట్‌ యు.అనూష, జనరల్‌ మెడిసిన్‌ ఎస్‌.కృష్ణనిఖిత్‌, ఆఫ్తాలమిక్‌ మీర్జా హజన్‌ శిబిరానికి వచ్చిన సుమారు 347 మందిని పరీక్షించి, ఉచితంగా మందులు అందించారు. వేసవిలో ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బీపీ, సుగరు, తదితర పరీక్షలతో పాటు ఈసీజీలు తీశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సత్యవతి, సూపర్‌వైజర్‌ బీహెచ్‌వీ సత్యనారాయణ, హెల్త్‌ అసిస్టెంట్‌ జి.యజ్ఞేశ్వరరావు, ఏఎన్‌ఎంలు జి.శ్రీదేవి, జి.సంతోషిణి, ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్‌ లక్ష్మీదుర్గ, పీహెచ్‌సీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన హెల్త్‌ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు సేవలందించారు.

ఆత్మ పరిశీలనలో జనసేన కార్యకర్తలు

మలికిపురం: రాష్ట్ర వ్యాప్తంగా జనసేన కార్యకర్తలు ఆత్మ పరిశీలన చేసుకుంటున్నారని వైఎస్సార్‌ సీపీ లీగల్‌ సెల్‌ రాష్ట్ర కార్యదర్శి మంగెన సింహాద్రి పేర్కొన్నారు. శనివారం ఆయన లక్కవరంలో మాట్లాడుతూ ఎన్నో ఆశలు పెట్టుకున్న జనసేన క్యాడర్‌ పొత్తు వల్ల తీవ్రంగా నష్టపోవడంతో వారంతా వైఎస్సార్‌ సీపీ వైపు మళ్లుతున్నారన్నారు. కాపులకు న్యాయం చేసింది జగనేనని అన్నారు.

రేవుల్లో స్నానాలు.. అత్యంత ప్రమాదకరం

- ప్రాణాలు హరిస్తున్న గోదావరి తీరాల్లోని ఊబులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ
- నిర్దేశించిన ప్రదేశాల్లోనే స్నానాలు చేయాలని వినతి



బదుగువానిలంకలో గోదావరి తీరం వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరికల బోర్డు



బదుగువానిలంకలో గౌతమీ గోదావరి తీరంలో ప్రమాదకర ప్రదేశం

ఆలమూరు: వేసవి సెలవులు కొందరికి వచ్చేశాయి.. మరి కొందరికి వచ్చేస్తున్నాయి.. యువతలో ఆటవిడుపు మొదలవుతుంది.. గౌతమీ గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లోని పలు ప్రదేశాలు బీచ్‌లను తలపిస్తూ అహ్లాదకరంగా ఉంటాయి. గోదావరి పరిసర ప్రాంత వాసులు నదీ తీరాన స్నానాలు చేసేందుకు తహతహలాడుతుంటారు. ఆహ్లాదభరితమైన వాతావరణాన్ని గడిపేందుకు ఉవ్విళ్లూరుతుంటారు. కానీ ఏ మాత్రం ఏమరపాటు ప్రదర్శించినా మృత్యువాత పడతామని మాత్రం ఊహించడం లేదు. ఫలితంగా ఏటా గోదావరి తీరాల్లో అనేక ప్రమాదాలు సంభవించి యువత ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల వెంబడి గౌతమీ, వశిష్ట, వైనతేయ నదులు ప్రవహిస్తుంటాయి. ఆ నదుల వెంబడి జిల్లా వాసులు కాని, వేసవిలో వచ్చే వారి బంధువులు, పర్యాటకులు అహ్లాదంగా గడిపేందుకు గోదావరి స్నానాలు చేయడం పరిపాటి. అయితే నదుల పరీవాహక ప్రాంతంలో అనేక చోట్ల ఊబిలు ఉన్న సంగతి తెలియని పర్యాటకులు మృత్యువాత పడుతున్నారు. కుటుంబసభ్యులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. అలాంటి ప్రమాదకరమైన ప్రదేశంగా ఆలమూరు మండలంలోని బదుగువానిలంక గోదావరి తీరం ప్రసిద్ధి గాంచింది. పదేళ్ల కాలంలో అనేక ప్రమాదాలు సంభవించి పలువురు మృత్యువాత పడ్డారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నష్ట నివారణ చర్యలు చేపడుతున్నా ప్రయోజనం కనిపించడం లేదు. ఈ ఏడాది ఏ విధంగానైనా ఒక్క ప్రమాదం కూడా జరగకూడదని గ్రామ పంచాయతీ నిర్ణయం తీసుకుని దానికనుగుణంగా ప్రత్యేక చర్యలు చేపట్టింది.

అనుమతి లేని ప్రదేశాల్లో గోదావరి స్నానాలు వద్దు

216 ఏ నంబర్‌ జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న బదుగువానిలంక పుష్కరఘాట్‌ సమీపాన ఉన్న గోదావరి తీర ప్రాంతంలో ప్రమాదకరమైన ఊబి ఉంది. ఈ ప్రాంతంలో ఇప్పటికే గడచిన ఐదేళ్లలో ఏడు ప్రమాదాలు సంభవించగా తొమ్మిది మంది మృతి చెందారు. అలాగే మూలస్థాన అగ్రహారంలో 2015 మే 1న జరిగిన ప్రమాదంలో నలుగురు , జొన్నాడలో జరిగిన ప్రమాదంలో ముగ్గురు, గతేడాది అక్టోబర్‌లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. దీంతో పాటు ఆత్రేయపురం మండలంలోని పిచ్చుకలంక, వద్దిపర్రు, బొబ్బర్లంక ప్రాంతాల్లోని నదీ తీరంలో ఇటీవల అనేక మంది గల్లంతైన సంఘటనలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యగా నదీ తీర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు ప్రమాదకరమైన ప్రదేశాల్లో పహారాను ఏర్పాటు చేయాలని ప్రజానీకం కోరుతుంది.

గోదావరి తీర ప్రాంతంలో ప్రత్యేక నిఘా



గ్రామంలో జరిగిన గత అనుభవాలు దృష్టిలో ఉంచుకుని గోదావరి నదీ పరీవాహక ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని అప్రమత్తం చేశాం. గ్రామస్తులు కూడా ప్రమాదాల నివారణకు తమ వంతు సహకారం అందిస్తున్నారు.

– దూలం వెంకటలక్ష్మి, సర్పంచ్‌, బదుగువానిలంక

అవగాహన పెంచుతున్నాం



మండల పరిధిలోని జొన్నాడ నుంచి మడికి వరకూ ఉన్న నదీ పరీవాహక ప్రదేశాల్లో పలుచోట్ల ప్రమాదకరమైన ప్రదేశాలు ఉన్నాయి. దీనిపై వివిధ శాఖాధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నాం. నదీతీరంలో ముఖ్యంగా ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసు శాఖ పని చేస్తుంది.

– ఎల్‌.శ్రీను నాయక్‌, ఎస్సై, ఆలమూరు

పొత్తులతో ఎవరినీ మోసం చేయలేరు

పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు



వీరవల్లిపాలెంలో ఓ వృద్ధురాలిని ఓట్లు అభ్యర్థిస్తున్న విప్పర్తి వేణుగోపాలరావు

అయినవిల్లి: ఒక్కడిపై గెలిచేందుకు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా మోసం చేయలేరు. రాష్ట ప్రజలే అంతా ఒక్కటై వారి తోకలను కత్తిరించి తీరుతారని వైఎస్సార్‌ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. అయినవిల్లి మండలం వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక గ్రామాల్లో శనివారం వైఎస్సార్‌ సీపీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్‌ అధ్యక్షతన విప్పర్తి వేణుగోపాలరావు ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విప్పర్తి వేణుగోపాలరావుకు మహిళలు మంగళహారతులతో అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. తమ రెండు ఓట్లు ఫ్యాన్‌ గుర్తుపై వేసి అసెంబ్లీ, పార్లమెంట్‌ స్థానాల్లో వైఎస్సార్‌ సీపీ అభ్యర్థులను గెలిపిస్తామన్నారు. తద్వారా జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా అత్యధిక సీట్లతో గెలిపిస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి కూటమి పొత్తులను ఎవరూ నమ్మబోరన్నారు. ఎన్నికల్లో వీరు చిత్తుగా ఓడటం ఖాయమన్నారు. పేదల తలరాతను సంక్షేమ మంత్రంతో మార్చేది రాష్ట్రంలో సీఎం జగన్‌ ఒక్కరేనని అన్నారు. తన ఐదేళ్ల పాలనలో మాట తప్పని మడమ తిప్పని నాయకుడిగా తన పేరును వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారన్నారు. దేశంలోనే ఉత్తమ పాలన అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడగడం తప్ప ఉమ్మడి కూటమి అభ్యర్థులు ప్రజల బాగోగులను చూడలేని స్థితిలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ, మేడిశెట్టి రాజా, దాసరి శ్రీనివాస్‌, మిండగుదిటి చిన్ని, దాసరి శైలజ, దామిశెట్టి బుజ్జి, బొంతు రాజేంద్ర ప్రసాద్‌, చిలువూరి సాయిరాజు, వింటి రాజా, గుత్తుల నాగబాబు తదితరులు ఉన్నారు.

వేంకటేశ్వర ఆలయాలకు పోటెత్తిన భక్తులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. రంగ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేశారు. ఈసందర్భంగా ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలు నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వెంకన్న ఆలయానికి..

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఏడుకొండల స్వామిని ఐదు వారాలు దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: అయినవిల్లి మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటికబెల్లం మొక్కు చెల్లించారు.

రన్‌ ఫర్‌ జీసస్‌



సఖినేటిపల్లిలో నిర్వహిస్తున్న రన్‌ ఫర్‌ జీసస్‌

సఖినేటిపల్లి: సఖినేటిపల్లి రేవు వద్ద నుంచి లక్కవరం సెంటర్‌ వరకూ శనివారం ఆరాధన టీవీ, ది గాడ్స్‌ వే ఆర్గనైజేషన్‌, సఖినేటిపల్లి, మలికిపురం మండలాల పాస్టర్స్‌ ఆధ్వర్యంలో రన్‌ ఫర్‌ జీసస్‌ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా పాస్టర్స్‌ ఫెలోషిప్‌ చీఫ్‌ అడ్వైజర్‌ బిషప్‌ డాక్టర్‌ పి.సామ్యేల్‌ ఫిన్ని, ది గాడ్స్‌ వే ఆర్గనైజేషన్‌ డైరెక్టర్‌ టి.స్పర్జన్‌ కింగ్‌ పాల్గొన్నారు. అలాగే పాస్టర్‌ దేవ ప్రవీణ్‌, రన్‌ ఫర్‌ జీసస్‌ కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ పాలపర్తి శేఖర్‌ రన్‌ ఫర్‌ జీసస్‌ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. పలువురు పాస్టర్లు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: మండల పాస్టర్స్‌ జేఏసీ మండలంలో దైవజనుల యూత్‌ ఆధ్వర్యంలో శనివారం ముక్తేశ్వరంలో నుంచి తొత్తరమూడి, శానపల్లిలంక, పోతుకూరు, జగన్నాథపురం, మాగం, సిరిపల్లి, నేదునూరు, అయినవిల్లి, గ్రామాల మీదుగా రన్‌ ఫర్‌ జీసస్‌ కార్యక్రమం నిర్వహించారు. సుమారు 32 కిలోమీటర్లు సువార్త దండయాత్ర కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించారు. పాస్టర్‌ అభిశక్తులైన దైవజనులు యేసయ్య మరణ పునరుత్థానం కోసం ఉపదేశం చేశారు. అయినవిల్లి జేఏసీ పాస్టర్స్‌ నాయకులు పాస్టర్స్‌ ఝెహోషువ, శేఖర్‌, ఆనంద్‌ కుమార్‌ తదితరులతో పాటు యువకులు, చిన్నపిల్లలు 430 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ సువార్త దండయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా యూపీఎఫ్‌ జనరల్‌ సెక్రటరీ పాస్టర్‌ ఎం.ఝెహోషువ ఆధ్వర్యంలో ఆరాధన కోఆర్డినేటర్‌ శేఖర్‌ గానం చేశారు.

దివ్యాంగ బాలలకు వైద్య పరీక్షల నిర్ధారణ శిబిరం



దివ్యాంగ బాలల వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరాజు

రావులపాలెం: ఆంధ్రప్రదేశ్‌ సమగ్ర శిక్ష సహిత విద్యలో భాగంగా శనివారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రావులపాలెం, ఆలమూరు, మండపేట, ఆత్రేయపురం, కొత్తపేట మండలాల్లో 18 సంవత్సరాల్లోపు దివ్యాంగ బాలలకు నిపుణులైన డాక్టర్లతో వైద్య పరీక్షల నిర్ధారణ శిబిరాన్ని సహిత విద్యా జిల్లా కో ఆర్డినేటర్‌ ఎంవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారి బి.శ్రీనివాస రాజు, ఏఎల్‌ఎస్‌సీ డి.రమేష్‌ బాబు, ఏఎంఓ రాంబాబు, ఏపీఓ ఎంఏకే బీమారావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస రాజు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సమగ్ర శిక్ష సహిత విద్యలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని 18 సంవత్సరాల దివ్యాంగ బాలలు ఉపయోగించుకుని ఆయా దివ్యాంగ బాలలకు నిపుణులైన వైద్యులు నిర్ధారించిన ఉపకరణాలు ఉచితంగా తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరానికి వచ్చి నియోజకవర్గంలో సుమారు 188 మంది దివ్యాంగ బాలలకు వైద్య పరీక్షలు చేసి కంటికి సంబంధించి కళ్లజోళ్లు, తదితర పరికరాలు ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు, దివ్యాంగ చిన్నారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగ బాలల వైద్య శిబిరానికి వచ్చిన పిల్లలకు, పెద్దలకు మొత్తంగా 300 మందికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ సభ్యుడు పడాల సోమిరెడ్డి అన్నదానం చేశారు. సంస్థ సభ్యులు స్వయంగా భోజనాలు వడ్డించారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండల ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణ మండపంలో శనివారం ఘనంగా జరిగింది. అధ్యక్షుడిగా పీవీవీఎస్‌ నాగేశ్వరరావు, సెక్రటరీగా రామచంద్రమూర్తి, ఉపాధ్యక్షుడిగా సీహెచ్‌ శేషారావు, ట్రెజరర్‌ వీఎస్‌వీ సుబ్రహ్మణ్యం, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని సంఘం సభ్యులకు శాలువాలతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా ఎప్పుడూ తన వెంటే ఉన్నారన్నారు. ఆర్యవైశ్యుల సంఘం పటిష్టతకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బోణం సాయిబాబు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు

అయినవిల్లి: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, మామ, బావ మరిది తోడికోడలు, ఆడపడుచుపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి. రాజేష్‌కుమార్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.

అయినవిల్లి మండలం కె.జగన్నాథపురానికి చెందిన దొమ్మేటి లత దుర్గాదేవికి కాకినాడకు చెందిన సురేంద్రకు 2018లో వివాహం అయ్యింది. పెండ్లి సమయంలో సురేంద్రకు రూ.3.5 లక్షలు నగదు, 35 కాసుల బంగారం, 300 గజాల స్థలం, రూ.2 లక్షల సారె ముట్టజెప్పారు. కొంత కాలం వీరి కాపురం సజావుగానే సాగింది. కొన్నాళ్లుగా భర్త సురేంద్ర, అత్త, మామ, బావ, మరిది, తోడి కోడలు, ఆడపడుచు అదనపు కట్నం తీసుకురమ్మని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని కొట్టి చంపుతామని బెదిరిస్తున్నారని లత దుర్గాదేవి అయినవిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాలువలో జారిపడి యువకుడి మృతి



గణేష్‌(ఫైల్‌)

రావులపాలెం: కాలువలోకి స్నానానికి వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని ముమ్మిడివరపాడు గ్రామానికి చెందిన దిగుమర్తి గణేష్‌ (18) శుక్రవారం రాత్రి పక్క గ్రామమైన గోపాలపురంలోని పి.గన్నవరం కాలువ వద్దకు స్నానానికి వెళ్లాడు. అయితే ఎంత సేపటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికులు గాలింపు చర్యలు చేయగా శనివారం గణేష్‌ మృతదేహం సమీపాన కాలువ రేవు వద్ద దొరికింది. దీంతో ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందినట్టు అధికారులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు అధికారులు తెలిపారు.

కూటమి అభ్యర్థుల ప్రచారం

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో శనివారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌ మాధుర్‌, ఉమ్మడి రాజోలు అసెంబ్లీ అభ్యర్థి దేవ వరప్రసాద్‌లు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అంతకు ముందు వారు ఆలయంలో లక్ష్మీనృసింహునికి పూజలు చేశారు. జెడ్పీ మాజీ చైర్మన్‌ నామన రాంబాబు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుద్ధుడి మార్గం అనుసరణీయం

అమలాపురం రూరల్‌: మహర్షి గౌతమ బుద్ధుడు సూచించిన మార్గం అనుసరణీయమని, అందరూ ఆయన బాటలో పయనించాలని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు సూచించారు. శనివారం అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో బుద్ధిస్ట్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శాంతి, సమానత్వం, సన్మార్గం వంటి మార్గాల్లో నడవాలని భగవాన్‌ గౌతమ బుద్ధుడు సూచించారన్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి డీబీ లోక్‌ అధ్వర్యంలో గొల్లపల్లిని ఘనంగా సత్కరించారు.

పండ్లు విషతుల్యం

- కార్బైడ్‌తో మగ్గించడమే కారణం
- కొరవడిన అధికారుల తనిఖీలు



అంబాజీపేటలో అలంకార ప్రాయంగా ఉన్న హెచ్చరిక ఫ్లెక్సీ

అంబాజీపేట: పండ్లు త్వరితగతిన పక్వానికి వచ్చేందుకు ప్రమాదకరమైన కార్బైడ్‌ వాడడం దుర్మార్గమని, వీటిని తింటే అనారోగ్య పరిస్థితులు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నా జిల్లా ప్రభుత్వాధికారులు స్పందించకపోవడం గమనార్హం. ఎప్పటి మాదిరిగానే కార్బైడ్‌తో మగ్గించిన పండ్లను జాతీయ రహదారులు, వివిధ కూడళ్లు, దుకాణాల వద్ద, మార్కెట్‌ యార్డు ఆవరణలోను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. సైకిళ్లు, తోపుడు బండ్లపైన గ్రామాలకు తీసుకువచ్చి అమ్ముతున్నారు. పండ్లు త్వరగా పక్వానికి రావడం వెనుక రసాయన పదార్థాలు ఉపయోగించడం అవి వాడితే కలిగే దుష్పరిణామాలపై పూర్తి ఆధారాలతో రాష్ట్ర హైకోర్టు ధర్మాసనం తీర్పు వెలువరించడంతో గ్రామాల్లోని ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. దీంతో యాపిల్‌, దానిమ్మ, బొప్పాయి, అరటి తదితర పండ్లు తినాలో వద్దో.. తింటే ఏం జరుగుతుందో అన్న మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం మాటల్లో తప్ప ఆచరణలో చూపించడం లేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఆరోగ్యాన్నిచ్చే పండ్లు అనారోగ్యాన్ని తెచ్చిపెడుతున్నాయి. రసాయనాలను కలిపి మాగబెట్టడంతో రోగాలను సైతం తట్టుకునే శక్తినిచ్చే పండ్లు అనారోగ్యాలకు కారకాలవుతున్నాయి. అరటి పళ్లు, యాపిల్‌, దానిమ్మ తదితర పండ్లు మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్‌, క్రిస్టైన్‌ వంటి రసాయనాలను గన్నులతో వ్యాపారులు చల్లించి పండిస్తున్నారు. ఇటీవల పట్టణంలో ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం 2006 ప్రకారం ప్రమాదకరమైన, హానికరమైన విషపదార్థాలను ఉపయోగించి పండ్లను మాగబెట్టినా, ప్రయత్నించినా ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.3 లక్షల జరిమానా విధించనున్నట్లు అధికారులు వాల్‌ పోస్టర్లను విడుదల చేసినా ఫలితం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. హైబ్రీడ్‌ ఆకాకరకాయలు, ప్రమాదకర రసాయనాలు ఉపయోగించి పండ్లు, కూరగాయలను తయారు చేస్తున్నప్పటికీ వైద్య ఆరోగ్య, ప్రజారోగ్య సంబంధిత శాఖలతో పాటు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు స్పందించక పోవడం గమనార్హం. ప్రజల పోరు పడలేక మార్కెట్‌ యార్డుల్లోను, కొన్ని ప్రాంతాల్లోను హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి గాలికి వదిలేశారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



విజయదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని సూర్యారావుపేటలో శనివారం విజయదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. గ్రామస్తుల విరాళాలతో స్థానిక మెయిన్‌ రోడ్డులోని పెద్ద కాలువ సమీపాన నిర్మించిన ఈ ఆలయంలోని అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని ఘనంగా సత్కరించారు. గ్రామంలో అనునిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తిభావం పెంపొందిస్తున్న గ్రామస్తులను ఆయన అభినందించారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన జరిగింది. వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ బూత్‌ కమిటీ మేనేజర్‌ నామాల శ్రీనివాసు, సర్పంచ్‌ చింతపల్లి వెంకటలక్ష్మి, కదలి ఉపేంద్ర, కదలి దుర్గారావు పాల్గొన్నారు.

ఇందుకూరికి సత్కారం



ఇందుకూరిని సత్కరిస్తున్న మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు

పి.గన్నవరం: వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన ఇందుకూరి నర్సింహరాజు శనివారం మండపేట వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా త్రిమూర్తులు నర్సింహరాజును దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రామచంద్రాపురం వైఎస్సార్‌ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌లను నర్సింహరాజు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాలు అందించారు.

పాలిటెక్నిక్‌, ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్‌కు ఉచిత శిక్షణ

కొత్తపేట: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పాలిటెక్నిక్‌, ఏపీఆర్జేసీ ఎంట్రన్స్‌ పరీక్షలు, కెరీర్‌ గైడెన్స్‌కు మండల బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు సంఘం మండల శాఖ అధ్యక్షుడు పితాని నాగేశ్వరరావు తెలిపారు. శనివారం నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసిన అనేకమంది పాలిటెక్నిక్‌, ఏపీఆర్జేసీలో చదవాలనుకుంటారన్నారు. దానికి ఎంట్రన్స్‌ పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. అందుకు శిక్షణ అవసరమన్నారు. ఆర్థిక పరిస్థితులతో శిక్షణ తీసుకోలేని ఎంతో మంది పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థుల కోసం తమ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిందన్నారు. ఈ మండలానికి సంబంధించి స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఏప్రిల్‌ 2 వ తేదీ నుంచి (మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు) అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రతిరోజు సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్‌ అందజేస్తామన్నారు. పది పరీక్షలు రాసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్‌ 9705434057 నంబర్‌కు ఫోన్‌ చేసి తమ పేరు రిజిస్టర్‌ చేయించుకోవాలని నాగేశ్వరరావు కోరారు. సమావేశంలో బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి ఆదివారపుపేట వెంకటేశ్వరరావు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్‌వీకేడీ ప్రసాద్‌, కార్యదర్శి గుత్తుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శనైశ్చరాలయంలో తైలాభిషేకాలు

కొత్తపేట: మండలంలోని మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన శనైశ్చరాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తమ జాతక రీత్యా శనిమహాదశ, అష్టమ శని, అర్ధాష్టమ శని ప్రభావం దోష పరిహారార్థం ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు, అనంతరం స్వామివారికి తైలాభిషేకాలు జరిపించారు. తైలాభిషేకాల టిక్కెట్లు ద్వారా రూ.85,162, మనియార్డర్ల రూపంలో రూ.1,863, అన్న ప్రసాదం విరాళాల రూపంలో రూ.28,034తో మొత్తం దేవస్థానానికి రూ.1,15,059 ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ అసిస్టెంట్‌ కమిషనర్‌, దేవస్థానపం ఈఓ కె.విజయలక్ష్మి తెలిపారు.